VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం , 05-10-2023 | సంపుటి : 06 సంచిక : 34 పేజీలు : 8 వెల : రూ 3-00

## పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సాయం: సీఎం జగన్



అమరావతి: ఏపీలో ఆహారశుద్ధి, పరిశ్రమలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. 7 ప్రాజెక్టులకు భూమిపూజతోపాటు మరో 6 ప్రాజెక్టులను తాడేపల్లి క్యాంపు కార్యాలయంల నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. మొత్తం 13 ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో రూ. 2,851 కోట్ల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. 13 జిల్లాల్లో ఏర్పాటైన పరిశ్రమలతో 6,705 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగావకాశాలు దక్కుతాయని తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు ఎప్పుడు ప్రభుత్వం అందుబాటులో ఉంటుందని, అన్ని రకాలుగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అందరూ అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని సీఎం చెప్పారు.

## సీఎం జగన్ దిల్లీ పర్యటన ఖరారు

అమరావతి: ఏపీ సీఎం జగన్ దిల్లీ పర్యటన ఖరారైంది. గురు, శుక్రవారాల్లో దిల్లీలో ఆయన పర్యటించనున్నారు. 5వ తేదీన ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి జగన్ దిల్లీ బయలుదేరి వెళ్తారు. అక్కడి 1 జన్‌పథ్ నివాసంలో రాత్రికి బస చేస్తారు. ఉదయం 9.45 గంటలకు 1 జన్‌పథ్ నివాసం నుంచి విజ్ఞాన్ భవన్‌కు చేరుకొని వామపక్ష తీవ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు.






విజయవాడ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, సీఐడీ కస్టడీ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో విచారణ వాయిదా పడింది. ఇరువైపుల వాదనలు విన్న ఏసీబీ కోర్టు విచారణను గురువారానికి (అక్టోబర్ 5కు) వాయిదా వేసింది. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే వాదనలు వినిపించారు. చంద్రబాబుకు బెయిల్ ఇవ్వొద్దని, కస్టడీకి అనుమతించాలంటూ ప్రభుత్వం తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదించారు. పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ విదేశాలకు పరారయ్యారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాళ్లిద్దరూ ఐటీ దర్యాప్తులో ఉన్నవాళ్లేనా? అని ఏఏజీని కోర్టు ప్రశ్నించింది. స్కిల్ కేసులో చంద్రబాబుతో ఆర్థిక లావాదేవీలు జరపటంతోనే వాళ్లిద్దరూ విదేశాలకు వెళ్లారని పొన్నవోలు తెలిపారు. వాంగ్మూలం ఇచ్చిన వీవీ రమేష్ మాట మార్చారని.. మీడియాలో వేరే విధంగా చెబుతున్నారన్నారు. అయితే, పెండ్యాల శ్రీనివాస్, వాసుదేవ్ విదేశాలకెళ్తే చంద్రబాబుకు ఏంటీ సంబంధం? అని సుప్రీంకోర్టు న్యాయవాది దూబే వాదనలు వినిపించారు. వారు విదేశాలకెళ్తే చంద్రబాబుకు బెయిల్ ఇవ్వొద్దనడం సబబేనా? అని అడిగారు. అంతకుముందు ఇవాళ ఉదయం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు వైపు ఎలాంటి తప్పిదాలు లేవని దుబే వాదించారు. "అప్పటి ఆర్థికశాఖ ఉన్నతాధికారి సునీత గుజరాత్ వెళ్లి అధ్యయనం చేశారు. ఆమె అధ్యయనం చేశాక సీమెన్స్ ప్రాజెక్టుకు ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. ఎలాంటి అభ్యంతరం లేకుండా ప్రాజెక్టు ఆమోదం పొందిందన్న ఆధారాలు ఉన్నాయి. కాస్ట్ ఎవాల్యుయేషన్ కమిటీ స్కిల్ ప్రాజెక్టు ఎక్విప్‌మెంట్ ధరను నిర్ధారించింది. ఆ కమిటీలో చంద్రబాబు లేరు. కమిటీలో ఉన్న భాస్కరరావు ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. సుప్రీంకోర్టు నవంబర్ 16 వరకు ఆయన బెయిల్‌ను పొడిగించింది. చంద్రబాబుకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేసి ఆ తర్వాత విచారణ చేపట్టారు. రెండు రోజులు కస్టడీలోనూ విచారించారు. ఇప్పుడు మళ్లీ కస్టడీ కావాలంటున్నారు.. ఆ అవసరం ఏముంది? కేబినెట్ ఆమోదం పొందాకే సీమెన్స్ ప్రాజెక్టు అమల్లోకి వచ్చింది.

## అప్పటివరకూ లోకేశ్‌ను అరెస్టు చేయొద్దు: సీఐడీకి హైకోర్టు ఆదేశం

అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి



నారా లోకేశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. విచారణను ఈ నెల 12కు న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటివరకూ లోకేశ్‌ను అరెస్ట్ చేయవద్దని సీఐడీకి హైకోర్టు ఆదేశించింది. స్కిల్ కేసులో లోకేశ్ పేరు చేర్చలేదని గత విచారణలో హైకోర్టుకు సీఐడీ తెలిపింది. అయితే, సీఐడీ దాఖలు చేసిన చంద్రబాబు రిమాండ్ రిపోర్ట్‌లో చంద్రబాబు కుటుంబ సభ్యులు లబ్ధి పొందినట్లు పేర్కొన్నారని లోకేశ్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు.

## పసుపు బోర్డుకు కేంద్ర కేబినెట్ ఆమోదం..

### సిలిండర్‌పై రాయితీ 300లకు పెంపు



దిల్లీ: కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉజ్వల పథకం లబ్దిదారులకు గ్యాస్ సిలిండర్‌పై ఇచ్చే రాయితీని రూ. 300 లకు పెంచింది. కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలను కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. తెలంగాణలో పసుపు బోర్డు, ములుగులో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కృష్ణా ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తూ తీర్మానానికి ఆమోదం తెలిపినట్టు అనురాగ్ తెలిపారు. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల వివాదం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య వాటాను తేల్చాలని కృష్ణా ట్రైబ్యునల్‌కు ఆదేశించినట్టు చెప్పారు. కొత్త నిబంధనలు రూపొందించి తమ వాటాను తేల్చాలని తెలంగాణ కోరుతోందని అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాల పంపిణీ చేయాలన్నారు. కేంద్రం నిర్ణయంతో తెలం గాణ ఆకాంక్ష నెరవేరుతుం దన్నారు. ఉజ్వల పథకం కింద పేదలకు సరఫరా చేసే వంట గ్యాస్ సిలిం డర్‌పై ప్రస్తుతం కేంద్రం రూ.200ల చొప్పున రాయితీ ఇస్తుండగా.. తాజాగా దాన్ని ?300లకు పెంచు తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉజ్వల లబ్ధిదారులు 14.2 కిలోల సిలిండర్ మార్కెట్ ధర రూ.903కు బదులుగా ప్రస్తుతం రూ.703 చెల్లిస్తుండగా.. తాజా నిర్ణయంతో ఇకపై సిలిండర్‌కు రూ.603 చెల్లిస్తే సరిపోతుంది.

## రాజకీయ పార్టీలు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి : డా. నిమ్మగడ్డ రమేష్ కుమార్




గుంటూరు, అక్టోబర్ 04, ఆంధ్రప్రదేశ్ లోని రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలపై దృష్టి సారించాలని మిగిలిన సమయంలో అభివృద్ధి కోసం కృషి చేయాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ జనరల్ సెక్రటరీ డా. నిమ్మగడ్డ రమేష్ కుమార్ పేర్కొన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర కమిటీ ఆద్వర్యంలో బుధవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్ లో జరిగిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. నిమ్మగడ్డ రమేష్ కుమార్ తో ముఖాముఖి కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగాడా. నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడు తూ గుంటూరు జిల్లాలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కొండా వెంకటప్పయ్య పంతులు, కన్నెగంటి హనుమంతు, పర్వతనేని వీరయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య లాంటి మహనీయులు కృషిచేసిన ఫలితంగా ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. దుగ్గిరాల వన్ సేవా ట్రస్ట్ (దోస్త్) ద్వారా తన స్వగ్రామానికి చేస్తున్న కృషిని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ వెనుక ఉందని, మనకన్నా తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని సోదాహరణంగా ఆయన వివరించారు. కాసు బ్రహ్మానందరెడ్డి లాంటి ముఖ్యమంత్రులను గుంటూరు జిల్లా అందించిందని, అవస్థాపన సౌకర్యాలు లేకపోవడం, పరిశ్రమలు అభివృద్ధి కాకపోవడం, రాజకీయ సంకల్పం లేకపోవడంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మృగ్యమవుతున్నాయని, పెట్టుబడులు రాకపోగా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. అమరావతి రాజధానిని అభివృద్ధి చేసుకోలేక పోవడం వలన గుంటూరు జిల్లా ఎంతో వెనుకబడిందిని, విద్వేషాలు, కక్షసాధింపులు, వెంటాడటం మాని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ పౌర సమాజ సంస్థ ఆద్వర్యంలో స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం, ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం, సామాజిక, ఆర్థిక అంశాలపై కృషి చేస్తుందని ఆయన వివరించారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ జనచైతన్య వేదిక రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో జిల్లా సమగ్రాభివృద్ధిపై నిష్ణాతులతో సదస్సులు నిర్వహించి, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. మాతృభూమి అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. విద్వేష రాజకీయాలకు స్వస్తి పలికి అభివృద్ధి రాజకీయాలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేసి లక్షలాది ఎకరాలకు నీరు లభిస్తే సంపద సృష్టించబడుతుందని, లక్షలాదిమందికి ఉపాది లభిస్తుందన్నారు. మన రాష్ట్రంలో గత నాలుగున్నర సంవత్సరాలలో నీటిపారుదల ప్రాజెక్టులకు బడ్జెట్ లో 5శాతం లోపే కేటాయించి అందులో సగం మాత్రమే ఖర్చుచేయడం వలన ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదన్నారు. విద్యుత్ రంగం లోపభూయిష్టంగా మారి వినియోగదారులపై పెనుభారం పెరుగుతుందన్నారు. రాజకీయాలలో పవిత్రత, నిజాయితీ తగ్గి ఘర్షణలు, వ్యక్తిగత దూషణలు, విద్వేషాలు పెరుగుతున్నాయన్నారు. నిధుల కొరతతో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని, పంచాయతి వ్యవస్థ నిర్వీర్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ యస్.పి కాళహస్తి సత్యనారాయణ, మానవత చైర్మన్ పావులూరి రమేష్, అఖిలభారత పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డా. జాస్తి వీరాంజనేయులు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు, అవగాహన సెక్రటరీ కొండా శివరామిరెడ్డి, తెలుగు భాషోద్యమ నేత డా. వి.సింగారావు, దీక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు యడ్లవల్లి కృష్ణ తదితరులు ప్రసంగించారు.

## అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలపై ఈసీ బృందం రెండోరోజు సమీక్ష

హైదరాబాద్: నగరంలో కేంద్ర ఎన్నికల సంఘం రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని ఈసీ బృందం.. ఇవాళ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు అధికారులతో సమావేశమైంది. జిల్లాల వారీగా ఎన్నికల సన్నాహకాలు, ప్రణాళికలను సమీక్షిం చనున్నారు. ఆయా జిల్లాలకు సంబంధించి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేసిన ఏర్పాట్లు, ఎన్నికల




ప్రణాళికలను అధికారులు వివరించనున్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలు, ప్రలోభాల విషయమై ఈసీ ఎక్కువగా దృష్టి సారించనుంది. హైదరాబాద్, చుట్టపక్కల ప్రాంతాల్లో ఓటర్ల జాబితా, డూప్లికేట్ ఓట్లు, తొలగింపు తదితర అంశాలపై ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నందున వాటి విషయమై ప్రత్యేకంగా ఆరా తీయనున్నారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, బందోబస్తు ప్రణాళికలు, సరిహద్దు నియోజకవర్గాల్లో పర్యవేక్షణ, చెక్ పోస్టులు తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నారు.

# సంపాదకీయం

గురువారం , 05-10-2023

## ఓబీసీల చుట్టూ రాజకీయం

రాజకీయాల్లో కులాలు, మతాలు ఆధారంగా ఓటుబ్యాంకు రాజకీయాలు చేయడం కొత్తేమీ కాదు. ఈ క్రమంలో దళితులను, గిరిజనులను, ముస్లిం మైనారిటీ వర్గాలను ఓటుబ్యాంకుగా మార్చుకుని కాంగ్రెస్ సహా అనేక పార్టీలు గెలుపొందుతూ వచ్చాయి. అల్పసంఖ్యాకంగా ఉన్న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య సామాజికవర్గాలు సైతం కొన్ని పార్టీలకు ఓటుబ్యాంకుగా పనికొచ్చాయి. కానీ దేశ జనాభాలో జనాభాలో 50% కంటే ఎక్కువగా ఉన్న ఇతర వెనుకబడిన వర్గాలు (ఓబీసీ)ను మాత్రం ఓటుబ్యాంకుగా మార్చుకోవడంలో ఏ పార్టీ సఫలం కాలేదు. వృత్తుల ఆధారంగా అనేక కులాల సమాహారంగా ఉండడం, రాజకీయ చైతన్యం విషయంలో కులాల మధ్య వ్యత్యాసాలు ఉండడం వంటి కారణాలతో గంపగుత్తగా అందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం సాధ్యపడలేదు. చివరకు ఓబీసీ ? మండల్ ఉద్యమాలతో రాజకీయాలు చేసిన సమాజ్‌వాదీ, రాష్ట్రీయ జనతా దళ్ వంటి పార్టీలు సైతం ఓబీసీ వర్గాలన్నింటినీ ఆకట్టుకోలేకపోయాయి. ఓబీసీల్లో సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న యాదవ, కుర్భ వంటి సామాజికవర్గాలే ఈ పార్టీలకు వెన్నుదన్నుగా నిలిచాయి.ఆ ఓటు బ్యాంకుపై ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు దృష్టి పెట్టాయి. ఇన్నాళ్లుగా విస్మరించిన వెనుకబడిన వర్గాలే ఇప్పుడు అధికారాన్ని సాధించడంలో కీలకంగా మారాయి. 80వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి వెన్నెముకలా నిలిచిన బీసీ ఓటర్లు.. దేశవ్యాప్తంగా 90వ దశకం నుంచి నిర్ణయాత్మక శక్తిగా ఎదిగారు. మండల్ కమిషన్ సిఫార్సుల లాలూ ప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్ వంటి బీసీ నేతలు దేశ రాజకీయాల్లో ఎదిగారు. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో కులం ఆధారిత రాజకీయ పార్టీలు సమాజ్‌వాదీ, ఆర్జేడీ, బీఎస్పీ, జేడీ(యూ) బలోపేతమయ్యాయి 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల్గినంత మెజారిటీ సాధించడం వెనుక కూడా ఓబీసీ ఓటుబ్యాంకే కీలకంగా మారింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తం కావడంతో ఆ ఓటుబ్యాంకు ఆయన వెంట నడిచొచ్చింది. మరోసారి గెలిచేందుకు కూడా ఓబీసీ ఓటుబ్యాంకుపైనే ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. గత మూడు, నాలుగు దశాబ్దాల్లో ఓబీసీ ఓటుబ్యాంకుకు మెల్లమెల్లగా దూరమవుతూ వచ్చిన కాంగ్రెస్ కూడా ఇప్పుడు ఆ వర్గాన్ని దరిచేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొత్తంగా దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు ఓబీసీ ఓటుబ్యాంకు పైనే కన్నేశాయి.దశాబ్దకాలంగా దేశ రాజకీయాల్లో ఓబీసీల రాజకీయ ప్రాబల్యం పెరిగింది. తదనుగుణంగా ప్రాధాన్యత, ప్రాతినిథ్యం కూడా పెరుగుతోంది. 2014లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ, బీజేపీ ప్రధాని అభ్యర్థిగా అడుగుపెట్టినప్పటి నుంచి పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. దేశంలో ముఖ్యంగా హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో ఓబీసీ సామాజికవర్గంలో ఆయనకు విశేష ఆదరణ కనిపించింది. తనను అధికారంలోకి తెచ్చిన ఓబీసీలకు ప్రయోజనం కల్పించడం కోసం ప్రధాని మోదీ నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వార్డ్ క్లాసెస్ (ఎన్సీబీసీ)కి రాజ్యాంగబద్ధత కల్పించారు. పూచీకత్తు అవసరం లేని ముద్ర రుణాల పథకాన్ని ఓబీసీలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టారు. 2019లో మరోసారి అధికారంలోకి వచ్చాక కేంద్ర మంత్రివర్గంలో చరిత్రలో ఎప్పుడూలేనంత పెద్ద సంఖ్యలో 26 మంది ఓబీసీ నేతలకు చోటు కల్పించారు. చేతి వృత్తులపై ఆధారపడే ఓబీసీ వర్గాలకు చేయూతనిచ్చేందుకు పీఎం–విశ్వకర్మ పథకాన్ని తీసుకొచ్చారు. 'విశ్వకర్మ యోజన' ద్వారా వడ్రంగులు, కుమ్మరులు, స్వర్ణకారులు, కమ్మరి వంటి చేతివృత్తుల కులాలు, కళాకారులు ప్రయోజనాలు అందుకోనున్నారు. ఈ వర్గాలు రాజకీయాల్లో అత్యంత నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురై ఉన్నారు.ప్రభుత్వపరంగానే కాదు, పార్టీలోనూ ఓబీసీలకు ప్రాధాన్యత పెంచుతూ వచ్చారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడిగా డా. కే. లక్ష్మణ్ వంటి విద్యాధికుడికి బాధ్యతలు అప్పగించారు. ఆయనకు బీజేపీలోనే అత్యున్నత నిర్ణయాత్మక విభాగమైన పార్లమెంటరీ బోర్డులో సభ్యుడిగా, పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీలో సభ్యుడిగా నియమించారు. సాధారణంగా రాజకీయ పార్టీలు తమకు భారీగా భూరి విరాళాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, బడాబాబులకు రాజ్యసభ సభ్యత్వాన్ని ఇస్తుంటాయి. బీజేపీ గత పదేళ్లలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తూ లక్ష్మణ్ వంటి నేతలను రాజ్యసభకు పంపించింది. 'సబ్ కా సాత్ ? సబ్ కా వికాస్ ? సబ్ కా విశ్వాస్' నినాదంతో అన్నివర్గాలను కలుపుకుపోతూ ఓబీసీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఓబీసీల ఆదరణతో మరోసారి గెలుపొందాలని భావిస్తోంది. కొన్ని అంచనాల ప్రకారం 2009లో కాంగ్రెస్ పార్టీకి 24 శాతం ఓబీసీ ఓట్లు రాగా ఆ ఏడాది బీజేపీకి 22 శాతం ఓబీసీ ఓట్లు వచ్చాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 34 శాతం ఓబీసీ ఓట్లు బీజేపీకి రాగా, కాంగ్రెస్‌కు 15 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక 2019లో బీజేపీకి ఓబీసీ ఓట్ల శాతం మరింత పెరిగి 44 శాతానికి చేరుకోగా, ఓబీసీ ఓట్లలో కాంగ్రెస్‌కు కేవలం 15 శాతం మాత్రమే వచ్చాయి. 80వ దశకం వరకు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సొంతంగానే గెలుచుకుంటూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ, 90వ దశకం నుంచి పతనం వైపు అడుగులు వేసింది. మండల్ ఉద్యమం, ఓబీసీల్లో పెరిగిన రాజకీయ చైతన్యం కారణంగా ఆ వర్గాలు కాంగ్రెస్‌కు దూరమై, ప్రాంతీయపార్టీల పరం అయ్యాయి. ఈ లోటును ఆ పార్టీ ఇదివరకు గుర్తించిందో లేదో కానీ ఇప్పుడు రాహుల్ గాంధీ ఓబీసీ రాగం అందుకున్నారు. ఓబీసీ జనాభా శాతంపై కచ్చితమైన లెక్కలు లేనప్పటికీ అనేక పెద్ద రాష్ట్రాల్లో 50% మించి జనాభా ఓబీసీలదే అన్న విషయంలో ఎవరికీ సందేహం లేదు. అంత పెద్ద ఓటుబ్యాంకును విస్మరించినా, నిర్లక్ష్యం చేసినా గెలుపు అందుకోవడం సాధ్యం కాదని ఆయన గ్రహించినట్టు కనిపిస్తోంది.

## రోడ్ టాక్స్ కట్టని మినీ బస్ పై కేసు నమోదు.....






విభారే న్యూస్ డోన్ ప్రతినిధి:– అక్టోబర్4బుధవారం సాధారణ తనికీలలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన టూరిస్ట్ మినీ బస్ బుధవారం రోజు ఉదయం గుత్తి సమీపంలో గల బాట సుకులమ్మ కు వెళ్లి తిరిగి హైద్రాబాద్ వెళుతున్న బస్‌ను డోన్ ఆర్ టి ఓ ఆఫీస్ ముందు డోన్ ఆర్ టి ఓ క్రాంతి కుమార్ తనికి చేయడం జరిగినది వాహనానికి సంబంధించిన రికార్డ్స్ పరిశీలించగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికీ చెల్లించవలసిన రోడ్ టాక్స్ కట్టకుండా వెళుతున్నారని గుర్తించి వాహనానికి 60680/- రూపాయల జరిమానా విధించటం జరిగిందని ఆయన తెలిపారు.

## ప్రజల దీవెనలతోనే చంద్రబాబు విడుదల కాబోతున్నారు

**ఆంధ్రప్రదేశ్ లో వైసిపి పార్టీ చిత్తుచిత్తుగా భూస్థాపితం కాబోతోంది**

**రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్ళడానికి కారణం వైసిపి ప్రభుత్వ అసమర్థతే**

**వచ్చేది టిడిపి–జనసేన లతో కూడిన ఉమ్మడి ప్రభుత్వమే**

**వైసీపీప్రభుత్వంలోచట్టవ్యతిరేకంగా, ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులకు, అధికారులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి శిక్షిస్తాం**



శ్రీ సత్య సాయి జిల్లా అక్టోబర్ 4 ( విభారె) పజల దీవెనలతోనే మచ్చలేని చంద్రుడుగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరలో విడుదల కాబోతున్నారని ధర్మవరం నియోజకవర్గ తెదేపా అభ్యర్థి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గత 22 రోజులుగా ధర్మవరం పట్టణంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్న శిబిరం వద్దకు పరిటాలశ్రీరామ్ చేరుకుని రిలే నిరాహార దీక్షలు చేపట్టిన బత్తలపల్లి మండల నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ 15 సంవత్సరాలు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసిన ఒక మాజీ ముఖ్యమంత్రిపై కక్ష కట్టి, రానున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోతామన్న భయంతో చంద్రబాబు నాయుడు చేపట్టిన బస్సు యాత్రకు విశేష స్పందన రావడంతో,అదేవిధంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుండి బ్రహ్మాండమైన ఆదరణ రావడంతో వైసిపి నాయకులు ఓర్చుకోలేక చంద్రబాబు నాయుడు పై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం దుర్మార్గమైన చర్యగా పరిటాల శ్రీరామ్ తీవ్రస్థాయిలో వైసీపీ ప్రభుత్వ తీరును ఖండించారు. ఈ రాష్ట్రానికి ఒక మంచి క్యాపిటల్ సిటీని తీసుకురావడానికి పేద రైతుల వద్ద నుండి దాదాపు 35 వేల ఎకరాలను సేకరించి ఒక మంచి రాజధాని నిర్మాణం చేపట్టాలనే లక్ష్యంతో ఆనాడు అమరావతి నిర్మాణం జరిగితే ఇప్పటివరకు అమరావతిలో ఒక్క ఇటుక కూడా పెట్టి కట్టలేని వైసీపీ అసమర్థ ప్రభుత్వ తీరును ఆయన ఎండగట్టారు. రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ అయిన పోలవరం ప్రాజెక్టను చంద్రబాబు గారి హయాంలో 75% పూర్తిచేస్తే జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఒక్క శాతం కూడా పోలవరం ప్రాజెక్టుని పూర్తి చేయలేని అసమర్థ పాలకులు ఈ రాష్ట్రాన్ని పాలించడం శోచనీయమని పరిటాల శ్రీరామ్ వైసీపీ నాయకుల తీరును దుయ్యబట్టారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కాలేదని రాజారెడ్డి రాజ్యాంగ అమలవుతుందని అధికారులు పోలీసులు వైసిపి నాయకులు చెప్పినట్లు విని ఇష్టానుసారం ప్రజల పైన తెదేపా నాయకుల పైన కేసులు పెట్టడం ఇబ్బందికి గురిచేయడం లాంటివి రాష్ట్రంలో అనేకం జరిగాయని వచ్చేది టిడిపి–జనసేన లతో కూడిన ఉమ్మడి ప్రభుత్వమేనని వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన అధికారులపైన ముఖ్యంగా పోలీసులపైన కొత్తప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి న్యాయస్థానంలో తప్పు చేసిన అధికారులందరి పైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో బత్తలపల్లి మండల ముఖ్య నాయకులతో పాటు ధర్మవరం నియోజకవర్గ పరిశీలకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత, సమస్యల పరిష్కారానికే పెద్దపీట

### జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



అనంతపురం సెప్టెంబర్ 4, జిల్లాలో మహిళల భద్రత, వారి సమస్యల పరిష్కారానికే పెద్ద పీట వేస్తామని అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు. అనంతపురం దిశ మహిళా పోలీసు స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. దిశ డీఎస్పీ ఎం.ఆంథోనప్ప, సి.ఐ చిన్న గోవిందులతో కలసి స్టేషన్లోని రిసెప్షన్ సెంటర్ , కౌన్సెలింగ్ రూం, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులకు ఇబ్బంది కల్గకుండా సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఫోక్సో, వేధింపులు, తదితర కేసులను సమీక్షించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా తక్షణ చర్యలు ఉండాలన్నారు. జిల్లాలో మహిళల భద్రత, సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేశామని... అందరూ ఇదే సంకల్పంతో పని చేయాలని తెలియజేశారు. మహిళల ఫిర్యాదులను చిరునవ్వుతో స్వీకరించి... సావధాన చిత్తంగా విని సమస్యల పరిష్కారానికి సత్వర కృషి జరిగేలా దిశ పోలీసులకు ఆదేశించారు. బాధితులు మనం కానీ, మన కుటుంబ సభ్యులైతే ఏమి కోరుకుంటామో ఆదిశగా చర్యలు మరియు ప్రవర్తన ఉండాలన్నారు. దిశ మహిళా పోలీసు స్టేషన్ కు వెళ్లొచ్చే బాధిత మహిళల్లో సంతృప్తి స్థాయి పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఏ మాత్రం అలసత్వం లేకుండా సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేసేలా దిశానిర్దేశం చేయాలన్నారు. ఎడబాటు, మనస్పర్థలతో దూరంగా ఉన్న భార్యాభర్తలను కౌన్సెలింగ్ ల ద్వారా ఏకం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాధిత మహిళల ఫిర్యాదుతో కేసు నమోదు, తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు జరుగకుండా అడ్డుకట్టకు కృషి... ఈవ్ టీజింగ్, తదితర వేధింపులకు గురయ్యే ప్రదేశాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ , గృహహింస, వరకట్న వేధింపులు, కిడ్నాపులు, బాల్య వివాహాలు, ర్యాగింగ్ లపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దిశ పోలీస్ స్టేషన్ లక్ష్యం నెరవేరేలా మహిళల్లో చైతన్యం కల్పిస్తూ మేమున్నామని భరోసా కల్పించేలా 'దిశ' పెట్రోలింగ్ బృందాలకు ఆదేశించారు. వల్నరబుల్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి... మహిళల సంచారం అధికంగా ఉన్న ప్రదేశాలు, రహదారులపై విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. దిశ యాప్ పై అవగాహన కల్పించి ప్రతీ మహిళ డౌన్ లోడ్ చేయించేలా పోలీసు విధులు చేపట్టాలన్నారు. ఆపద సమయంలో 'దిశ' యాప్‌ఎూూ బటన్ నొక్కితే తక్షణం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆపద నుండి రక్షిస్తారనే విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసికెళ్లేలా సూచనల జారీ చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా మహిళల సంబంధిత సమస్యలు, వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ ఉంటే జిల్లా ఎస్పీ ఫోన్ నెంబర్ 94407 96800 కు ఫోన్ చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో భాగంగా....



విభారే న్యూస్ డోన్ ప్రతినిధి:–అక్టోబర్4 బుధవారం నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికలఅధికారిసూచనల మేరకు డోన్ తాసిల్దార్ విద్యాసాగర్. ఓటరు జాబితా ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టిన తరువాత సవరణ కార్యక్రమంలో భాగంగా మరణించిన ఓటర్లు, ప్రస్తుత ప్రదేశము నుండి శాశ్వతముగా వెళ్ళిపోయినవారు, డూప్లికేట్ ఓట్లు, డబల్ ఎంట్రీ ఓట్ల విషయమై జిల్లా ఎన్నికలఅధికారివారుయిచ్చినసూచనలమేరకు ఫామ్ -7 పై వచ్చిన అభియోగాల పై 100% ప్రక్రియ ఫాలో కావాలి అని వీటిపై ఫామ్ -13 మరియు ఫామ్ -14 నోటీసులు పంపి విచారణ చేపట్టి ఆ తరువాత తదుపరి చర్య తీసుకొనుటకు సూచనలు ఇవ్వడం జరిగింది ఆయన తెలుపడమైనది

## మృతి చెందిన సబ్ స్టేషన్ ఆపరేటర్ కు ఆర్థిక సహాయం....



విభారీ న్యూస్ డోన్ ప్రతినిధి:– అక్టోబర్4 బుధవారం డోన్ మండల పరిధిలోని మల్యాల సబ్ స్టేషన్ లో పనిచేస్తున్నటువంటి గోవిందు అనే షిఫ్ట్ ఆపరేటర్ గత నెలలోమృతిచెందడంజరిగింది. కుటుంబానికి ఉద్యోగులు మరియు కాంట్రాక్ట్ సిబ్బంది సానుభూతి తెలియజేస్తూ 36,850 నగదును ఆర్థిక సహాయంగాలైన్మెన్ రవి,నాగార్జున,నాగరాజు,కాంట్రాక్ట్ కార్మికులు పాండురంగ, గౌస్, గోపి, సాయి పురుషోత్తం, అంకన్న తదితరులు కలిసి అందజేశారు.

## రూ.20 స్టాంపు పై 16 వరకు కోర్టు విధుల బహిష్కరణ

### ధర్మవరం న్యాయవాదుల తీర్మానం



ధర్మవరం అక్టోబర్ 4 ఆంధ్ర రేఖ ప్రతినిధి కోర్టులో పిటిషన్లకు రూ.1 స్థానంలో రూ.20 స్టాంపు వేయాలని బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయవాదులు వ్యతిరేకించారు. కోర్టుల్లో రోజూ వందల సంఖ్యలో న్యాయవాదులు తమ కక్షిదా రుల తరపున పిటిషన్లు దాఖలు చేస్తుం స్టాంపు అతికించేవారు. ఈ స్టాంపు స్థానంలో ఈ నెల 5 నుంచి రూ.20 విలువ గల స్టాంపును అతి కించాలని బార్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ధర్మవరం బార్ అసోసియేషన్ బధువరం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించింది. న్యాయవాదులు ముక్త కంఠంతో బార్ కౌన్సిల్ తీర్మానాన్ని వ్యతిరేకించారు. బుధవారం నుంచి ఈ నెల 16 వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు తీర్మానించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యం పి. సుబ్బారావు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని తరహాలో రాష్ట్రంలో స్టాంపు లను పెంచుతున్నారన్నారు. కక్షిదారులు న్యాయం పొందలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాయ లసీమ లాంటి వెనుకబడిన జిల్లాలో ఫీజులు భరించలేక హైకోర్టుకు వెళ్లే అప్పీళ్ల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు న్యాయం పొందటం కష్టంగా మారుతుంద మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో వకాలకు అతికించే వెల్ఫేర్ స్టాంపు రూ.30 ఉండగా ఈ రాష్ట్రంలో మాత్రం రూ. 100కు పెంచారన్నారు. ఇప్పటికే కక్షిదారులు ఇబ్బంది. పడుతుంటే ప్రస్తుతం పిటిషన్లకు వేసే స్టాంపుల విలువను పెంచడం సరికాదన్నారు. బార్ అసోసియేషన్ల ఆమోదం లేకుండా రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. స్టాంపు. లపై నిర్ణయం వెనక్కి తీసుకునే దాకా ఉద్యమాన్ని కొనసాగిస్తామ న్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు.



# 15 నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు

తిరుమల, అక్టోబరు 4, తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకోసారి అధికమాసం వస్తుంది. ఇలావచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ప్రధానంగా అక్టోబర్ 19న గరుడ వాహనం, 20న పుష్పకవిమానం, అక్టోబర్ 22న స్వర్ణరథం, 23న చక్రస్నానం నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ రాత్రి 7 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. అక్టోబర్ 14న అంకురార్పణంవైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం అత్యంత ముఖ్యమైంది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు అంకురార్పణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి సేనాధిపతి అయిన శ్రీవిష్వక్సేనులవారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు చేపడతారు. ఆ తరువాత అంకురార్పణం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్టోబర్ 15న బంగారు తిరుచ్చి ఉత్సవంఅక్టోబర్ 15 ఉదయం 9 గంటలకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు ఉదయం శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామివారు బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షిస్తారు. అక్టోబర్ 15న పెద్దశేషవాహన సేవ (రాత్రి 7 గంటలకు)మొదటిరోజు రాత్రి శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై(పెద్ద శేషవాహనం) తిరుమాడ వీధులలో భక్తులను అనుగ్రహిస్తారు. అక్టోబర్ 16న చిన్నశేషవాహన సేవ (ఉదయం 8 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 2వ రోజు ఉదయం మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబర్ 16న హంస వాహన సేవ (రాత్రి 7 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 2వ రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు హంసవాహనంపై సరస్వతిమూర్తి అవతారంలో దర్శనమిస్తారు. అక్టోబర్ 17న సింహ వాహన సేవ (ఉదయం 8 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు ఉదయం మలయప్పస్వామివారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారి దశావతారాల్లో నాలుగవది నరసింహ అవతారం కావడం సింహం గొప్పదనాన్ని తెలియజేస్తోంది. అక్టోబర్ 17న ముత్యపుపందిరి వాహన సేవ (రాత్రి 7 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు రాత్రి మలయప్పస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబర్ 18న కల్పవృక్ష వాహన సేవ (ఉదయం 8 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు ఉదయం మలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబర్ 18న సర్వభూపాల వాహన సేవ (రాత్రి 7 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిస్తారు. అక్టోబర్ 19న మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు)బ్రహ్మోత్సవాలలో 5వ రోజు ఉదయం శ్రీవారు మోహినీరూపంలో శృంగారరసాధి దేవతగా భాసిస్తూ దర్శనమిస్తారు. పక్కనే స్వామి దంతపుపల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరో రూపంలో అభయమిస్తాడు. అక్టోబర్ 19న గరుడ వాహన సేవ (రాత్రి 7 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు రాత్రి గరుడవాహనంలో జగన్నాటక సూత్రధారియైన శ్రీ మలయప్పస్వామివారు తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులందరికీ తన దివ్యమంగళ రూపదర్శనమిస్తాడు. అక్టోబర్ 20న హనుమంత వాహన సేవ (ఉదయం 8 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు ఉదయం శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబర్ 20న పుష్పకవిమాన సేవ (సాయంత్రం 4 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పుష్పకవిమానం విహరిస్తారు. పుష్పక విమానం మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక మాసం సందర్భంగా నిర్వహించే నవరాత్రి బ్రహ్మోత్సవాలలో నిర్వహిస్తారు. వాహనసేవల్లో అలసిపోయే స్వామి, అమ్మవార్ల సేద తీరడానికి పుష్పక విమానంలో వేంచేపు చేస్తారు. అక్టోబర్ 20న గజవాహన సేవ (రాత్రి 7 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు రాత్రి వేంకటాద్రీశుడు గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిస్తారు. అక్టోబర్ 21న సూర్యప్రభ వాహన సేవ (ఉదయం 8 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 7వ రోజున ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు తిరుమాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. అక్టోబర్ 21న చంద్రప్రభ వాహన సేవ (రాత్రి 7 గంటలకు)శ్రీవారి బ్రహ్మో త్సవాల్లో 7వ రోజు రాత్రి మలయప్పస్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ తన రాజసాన్ని భక్తులకు చూపుతారు. చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండడం విశేషం. అక్టోబర్ 22న స్వర్ణరథం (ఉదయం 7.15 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు ఉదయం శ్రీనివాసుడు స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తారు. స్వర్ణరథం స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైంది. అక్టోబర్ 22న అశ్వవాహన సేవ (రాత్రి 7 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు రాత్రి మలయప్పస్వామివారు అశ్వవాహనంపై విహరించి భక్తులను అనుగ్రహిస్తారు. 23న చక్రస్నానం (ఉదయం 6 గంటలకు)శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన 9వ రోజు ఉదయం చక్రస్నానం వేడుకగా జరుగుతుంది. ముందుగా ఉభయదేవేరులతో కలిసి శ్రీవారి సరసన ఉన్న చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తెనె, చందనంతో అర్చకులు అభిషేకం చేస్తారు. చక్రస్నానం సమయంలో అధికారులు, భక్తులందరూ పుష్కరిణిలో స్నానం చేసి యజ్ఞఫలాన్ని పొందుతారు.

## గ్రామ సచివాలయం, ఆర్బీకే కొత్త భవనాలు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రాక



పెద్దకడుబూరు అక్టోబరు 04: (విభారె)పెద్దకడబూరు మండల వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గురువారం హనుమాపురం గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను రేపు ఉదయం 10 గంటలకు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు . కావున ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

# సేమ్ 2 సేమ్...

## ఏపీలో మారని రాజకీయాలు

విజయవాడ, అక్టోబరు 4, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేసిన తర్వాత, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్ కేసులలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు కూడా సీఐడీ నోటీసులు ఇచ్చింది. లోకేశ్‌ని కూడా జైలుకు పంపించి... నాయకత్వ లేమితో టీడీపీ శ్రేణులను నిరాశకు గురిచేయాలని వైసీపీ ప్రయత్నాలు చేస్తోంది. నాయకుడు జైల్లో ఉంటే ఏమవుతుంది? గతంలో జగన్ జైల్లో ఉన్నప్పుడు ఏం జరిగిందో... ఇప్పుడూ అదే జరుగుతుంది. అప్పుడు దివంగత నేత రాజశేఖర్ రెడ్డి సతీమణి విజయమ్మ పాత్రను ఇప్పుడు చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి, కూతురు షర్మిల పాత్రను ఆయన కోడలు బ్రాహ్మణి పోషిస్తున్నారు. ఈ రాజకీయాలలో మారేది పాత్రలే తప్ప కథ, స్క్రీన్‌ప్లే కాదు. చట్ట సభల్లో 33 శాతం మహిళల రిజర్వేషన్ అమలుకు ఇంకా సమయం పట్టవచ్చేమోగానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం దశాబ్దకాలంగా మహిళలే రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. దివంగత నేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆకస్మిక మరణం తర్వాత ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠంపై ఆశలు పెట్టుకున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం సీనియర్ నేత రోశయ్యను, అనంతరం కిరణ్‌కుమార్ రెడ్డిని సీఎంగా చేయడంతో జగన్మోహన్‌రెడ్డి పార్టీ హైకమాండ్‌కు ఎదురుతిరిగారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి కుర్చీ దక్కదనే అంచనాతో 2010 నవంబర్ 29న ఎంపీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2011 మార్చి 11న వైఎస్సార్సీపీ పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. పార్టీని బలోపేతం చేయడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్న క్రమంలో అక్రమంగా ఆస్తులు కూడగట్టారనే అభియోగంతో 2012 మే 27న జగన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. ఈ కేసుకు సంబంధించి 16 నెలల పాటు జగన్ చంచల్‌గూడ జైలులో ఉన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధినేత జైల్లో ఉన్నారు కాబట్టి పార్టీ చచ్చిపోతుందని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావించింది. కానీ అందుకు భిన్నంగా ఈ చర్యలే వైఎస్ఆర్‌సీపీ పునాదులు బలపడడానికి కారణాలయ్యాయి. జగన్మోహన్‌రెడ్డి తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల రాజకీయ రంగప్రవేశానికి తలుపులు తెరుచుకున్నాయి. జగన్‌కి బెయిల్ దొరకకపోవడంతో షర్మిలా పార్టీ బాధ్యతలన్నింటినీ తన భుజాన వేసుకున్నారు. తనకు తాను 'జగనన్న వదిలిన బాణం' అని ప్రకటించుకున్న ఆమె 3 వేల కిలోమీటర్ల భారీ పాదయాత్ర చేసి కష్టకాలంలో వైఎస్సార్సీపీని ఒడ్డున పడేశారు. 16 జిల్లాల్లో చేపట్టిన ఈ పాదయాత్రలో కోటిమందికి పైగా జనాలను షర్మిల ప్రత్యక్షంగా కలిసినట్లు అంచనా. 2013 సెప్టెంబర్‌లో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జగన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసే వరకూ షర్మిల పార్టీ కార్యక్రమాల్ని నిరాటంకంగా నడిపించారు. మరోవైపు విజయమ్మ అసెంబ్లీ సాక్షిగా ప్రజా సమస్యలను లేవనెత్తి ప్రజల మనుసులను చూరగొనడనంతోపాటు పార్టీని బతికించారు, నిలబెట్టారు. విజయమ్మ సమైక్యాంధ్ర ఉద్యమంలో కూడా క్రియాశీల పాత్ర పోషించారు. వైఎస్సార్సీపీని తమ శక్తియుక్తులతో మండే అగ్నిగోళంలా తయారు చేసిన ఘనత ఈ తల్లీ కూతుళ్లకే దక్కుతుంది. ఆ తర్వాత జగన్ ప్రతిపక్ష నేత కావడం, ముఖ్యమంత్రి కావడంలో వీరిద్దరి పాత్ర వెలకట్టలేనిది. గతంలో జగన్ జైలు పాలయినప్పుడు తల్లీ కూతుళ్లు పార్టీ పటిష్టతకు కష్టపడితే, మరోవైపు జగన్ సతీమణి వైఎస్.భారతీ న్యాయ పోరాటంలో ఆయనకు బాసటగా నిలిచారు. జగన్ జైలు పాలయినప్పుడు కొణతాల రామకృష్ణ, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శోభనాగిరెడ్డి, మైసూరారెడ్డి, సోమయాజులు, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి సీనియర్ నేతలు పొలిటికల్ అఫైర్స్ కమిటీని ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేశారు. ఇప్పుడు చంద్రబాబు అరెస్టు కావడంతో టీడీపీ ఆవిర్భావం నుండి పార్టీలో ఉన్న యనమల రామకృష్ణ, అశోక్ గజపతిరాజు, బుచ్చయ్య చౌదరి, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, రామ్మోహన్‌నాయుడు, బాలకృష్ణ వంటి సీనియర్ నేతలు పొలిటికల్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి పార్టీలో ఉత్సాహాన్ని నింపడానికి ప్రయత్నిస్తున్నారు. వీటికి అదనంగా నందమూరి కుటుంబం ఒక్కటై చంద్రబాబు పక్షాన నిలబడింది. అంతేకాక, టీడీపీ–జనసేన కూటమి తరఫున ఒక జేఏసీ ఏర్పాటు చేసి ఉమ్మడిగా కార్యక్రమాలు చేపడుతామని ఉభయ పార్టీల నేతలు చెప్పారు జగన్‌పై అక్రమంగా కేసులు నమోదు చేశారంటూ మద్దతు ప్రకటించిన వామపక్షాలు ఇప్పుడు కూడా చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీకి బాసటగా ఉంటున్నారు. వీరికి పలు ప్రజాసంఘాలు కూడా తోడవుతున్నాయి. గతంలో జగన్‌పై కేసుల సందర్భంగా సీబీఐ సంస్థను కేంద్ర ప్రభుత్వం చేతిలో పంజరం అనే ఆరోపణలొస్తే, ఇప్పుడు చంద్రబాబు అరెస్టు తర్వాత సీఐడీని రాష్ట్ర ప్రభుత్వం చేతిలో పంజరం అంటూ అవే రకమైన విమర్శలు వెలువడుతున్నాయంటే అప్పటి నాటకం మళ్లీ ఇప్పుడు తిరిగి ప్రారంభమైందని చెప్పవచ్చు.

# కేసుల నుంచి లోకేష్ సేఫ్

విజయవాడ, అక్టోబరు 4,టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను అరెస్ట్ చేస్తామని వైసీపీ నేతలతో పాటు సీఐడీ పోలీసులు కొద్ది రోజులుగా చేస్తున్న ప్రకటనలు సంచలనంగా మారాయి. ఢిల్లీలో ఉన్న నారా లోకేష్ ను అరెస్ట్ చేసి తీసుకు వచ్చేందుకు టీమ్ కూడా వెళ్లిందన్నారు. లోకేష్ కనిపించడం లేదని వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అయితే ఇప్పుడు నారా లోకేష్ అరెస్టు చేయడానికి అవకాశం లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫైబర్ గ్రిడ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం నారా లోకేష్ దాఖలు చేసుకున్న పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. విచారణలో లోకేష్‌ను అరెస్ట్ చేస్తారనే ఆందోళన తమకుందని లోకేష్ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.



అయితే లోకేష్‌ను ఇంతవరకూ ఫైబర్ గ్రిడ్ కేసులో నిందితుడిగా చేర్చలేదని ప్రభుత్వ న్యాయవాది స్పష్టం చేశారు. ఒకవేళ చేరిస్తే ఆయనకు సీఆర్‌పీసీలోని 41 ఏ కింద నోటీసులు ఇస్తామని ప్రభుత్వం తరపు న్యాయవాది చెప్పారు. 41 ఏ నిబంధనలు పాటించకపోతే కోర్టుకు విన్నవిస్తామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో సీఐడీ ఇచ్చిన 41ఏ నోటీసులోని నిబంధనలను హైకోర్టులో లోకేష్ సవాల్ చేశారు. లోకేష్ సిఐడీ విచారణ ఈ నెల 10వ తేదీకి వాయిదా వేస్తూ సిఐడీకి హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.

# కౌలు ఇవ్వని సర్కార్

గుంటూరు, అక్టోబరు 4, అమరావతికి భూములు ఇచ్చిన రైతులపై ఏపీ ప్రభుత్వం పగ సాధిస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటి వరకూ జరిగినవి కాకుండా చట్ట ప్రకారం ఇవ్వాల్సిన కౌలు కూడా ఇవ్వడం లేదు. రాజధాని నిర్మాణం కోసం తొమ్మిదేళ్ల క్రితం భూములు ఇచ్చిన రైతులకు ప్రతి ఏటా ఇచ్చే వార్షిక కౌలు అందజేయడంలో గత మూడేళ్లుగా తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అందరూ చిన్న, సన్నకారు రైతులే కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు లేక.. కౌలు ఇవ్వక.. ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వక సమస్యలు ఎదుర్కొంటున్నారు. 2016 నుంచి 2019 వరకు ఏటా ఏప్రిల్ నుంచి మే చివరిలోగా వార్షిక కౌలు సొమ్ము రైతుల ఖాతాల్లో జమయ్యేది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2020 నుంచి ఏటా జూన్ నుంచి ఆగస్టులోగా జమ చేస్తూ వచ్చింది. ఈ ఏడాది ఇంత వరకు రైతుల ఖాతాల్లో వార్షిక కౌలు జమ కాలేదు. తమకు కౌలు సొమ్ము రాలేదని కోర్టును ఎవరైతే ఆశ్రయిస్తున్నారో వారికి మాత్రమే కౌలు చెల్లింపులు జరుగుతున్నాయి. కోర్టును ఆశ్రయించిన దాదాపు 2,400 మందికి ఈ ఏడాది వార్షిక కౌలు జమైంది. మిగతా వారికి ఇంతవరకూ జమకాలేదు. కోర్టులో పిటిషన్ వేయగానే సంబంధిత పిటిషన్‌దారులకు కౌలు చెల్లిస్తున్న సిఆర్‌డిఎ అధికారులు... మిగతా వారి గురించి పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. రాజధాని నిర్మాణ నిమిత్తం 2015లో సిఆర్‌డిఎకు భూములు అప్పగించిన 22,736 మంది రైతులకు పదేళ్లపాటు ఏటా పది శాతం పెంచేలా అప్పటి టిడిపి ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలు సాయం ప్రకటించింది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30 వేలు, మూడు పంటలు పండే జరీబు భూముల రైతులకు ఎకరాకు రూ.50 వేలు కౌలు అప్పటి టిడిపి ప్రభుత్వం నిర్ధారించింది. ఈ మొత్తంపై ఏటా పది శాతం సొమ్ము పెంచి రైతుల ఖాతాల్లో జమయ్యేలా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోన్నా, చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూ సమీకరణలో 22,736 మంది రైతులు 33,717 ఎకరాల భూములు ఇవ్వగా, వీరికి 2015 నుంచి 2019 వరకు సకాలంలో కౌలు డబ్బులు వారి ఖాతాల్లో జమయ్యాయి. 2020 నుంచి ఏటా జాప్యం జరుగుతోంది. కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వారికి మాత్రమే 2021 నుంచి ఏటా రైతులకు కౌలు సాయం అందిస్తున్నారు. ఈ ఏడాది మేలో ఇవ్వాల్సిన కౌలు సొమ్ము ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. జీవో జారీ చేశామని ఓ సారి.. సీఎఫ్ఎంఎస్‌లో ఉన్నాయని మరోసారి వాదనలు వినిపించి మూడు, నాలుగు వారాల వాయిదా కోరుతున్నారు ప్రభుత్వ లాయర్లు. ఆ తర్వాత కూడా కోర్టును ఆశ్రయించిన వారికే ఇస్తున్నారు. గత రెండేళ్లుగా అసైన్డు రైతులకు కూడా కౌలు పరిహారం నిలిచిపోయింది. 29 గ్రామాల్లో మూడు వేల మంది అసైన్డు రైతులు ఉన్నారు. వీరి భూములు కూడా రాజధానికి తీసుకున్నారు. అసైన్డు భూముల అప్పగింతలో అక్రమాలు జరిగాయని సిఐడి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తు పెండింగ్‌లో ఉండడంతో మూడు వేల మంది అసైన్డు రైతులకు కౌలు పరిహారం నిలిపివేశారు. ఏ భూమి వివాదంలో ఉంటే ఆ భూమికి పరిహారం నిలిపివేయాలని, అందరికీ నిలిపివేయడం సరికాదని అసైన్డు రైతులు గత రెండుళ్లుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

# లిక్కర్ స్కాంలో అందరూ అప్రూవర్లే

విజయవాడ, అక్టోబరు 4, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎంపీ మాగుంట శ్రీనువాసులు కొడుకు మాగుంట రాఘవ అప్రూవర్‌గా మారిన సంగతి తెలిసిందే. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అప్రూవర్‌గా మారడానికి మాగుంట రాఘవ చేసుకున్న దరఖాస్తును తాజాగా రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి ఇచ్చింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో మాగుంట రాఘవ అప్రూవర్‌గా మారారు. ఈ కేసులో జైలుకెళ్లిన మాగుంట రాఘవ ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. రాఘవతో పాటు ఈ కేసులో మరో కీలక నిందితుడు దినేష్ ఆరోరా అప్రూవర్‌గా మారడాన్ని కూడా కోర్టు పర్మిషన్ ఇచ్చింది. ఇంతకు ముందే ఈ కేసులో మాగుంట రాఘవ తండ్రి.. వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అప్రూవర్ గా మారారు. ఇ ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇప్పటికే 20 మంది నుండి కీలక సమాచారం సేకరించింది ఈడీ. హైద్రాబాద్ నుండి ఢిల్లీకి నగదు బదిలీపై ఈడీ అధికారులు ఫోకస్ పెట్టారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇచ్చిన సమాచారంతో పలువురిని ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈ విషయమై ఈడీ అధికారులు దర్యాప్తులో మరింత దూకుడును పెంచింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో మాగుంట రాఘవరెడ్డి, శరత్ చంద్రారెడ్డిలు అప్రూవర్ గా మారారు. ఈ కేసులో మాగుంట రాఘవ, శరత్ చంద్రారెడ్డిలు బెయిల్ పై ఉన్నారు. మాగుంట రాఘవ బెయిల్ మంజూరైంది. వైద్య కారణాలతో రాఘవకు ఢిల్లీ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈడీ అధికారులు ఎప్పుడు పిలిచినా.. చెన్నై లేదా దిల్లీ కార్యాలయంలో వారి ఎదుట హాజరుకావాలని కోర్టు ఆయన్ను ఆదేశించింది. చెన్నైకే పరిమితం కావాలన్న న్యాయస్థానం.. ప్రతి మంగళ, శుక్రవారాల్లో సాయంత్రం 4గంటలకు ఈడీ ఎదుట రిపోర్టు చేయాలని సూచించింది. ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లొద్దని.. పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేయాలని దిల్లీ హైకోర్టు ఆదేశించింది. సౌత్ లాబీలో ఒక్క కవిత తప్ప అందరూ అప్రూవర్లుగా మారారు. కవిత తనను ఈడీ విచారణను పిలవడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టులో కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. ఈ పిటిషన్‌పై ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను నవంబర్ 20కు వాయిదా వేసింది. అక్టోబర్ 18న పిఎంఎల్ఎ కేసులకు సంబంధించి ప్రత్యేక ధర్మాసనం విచారణ ఉందని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ తెలిపారు. ఈ విచారణ అనంతరం కవిత పిటిషన్ పై విచారణ చేపడతామన్నారు. అయితే అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో నవంబర్ 20 వరకు ఎంఎల్‌సి కవితను విచారణకు పిలవబోమని ఇడి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ పిటిషన్ విచారణ సమయంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలు ఏ స్థాయిలో ఉన్నారనేది పక్కనబెడితే అసలు విచారణకు పిలవద్దంటే ఎలా? అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అన్నారు. అఈ పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబర్ 20కు వాయిదా వేసినట్లు తెలిపారు. దిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు రావాలంటూ ఇడి జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇడి నోటీసులపై బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కోర్టును కోరారు. నళిని చిదంబరం కేసులో మాదిరి ఉపశమనం కోరుతున్నానన్నారు. మహిళల విచారణకు సంబంధించిన మార్గదర్శకాలపై కూడా స్పష్టత చేయాలని కోర్టును కవిత కోరారు

# దీర్ఘకాలిక వ్యూహం మిస్

నెల్లూరు, అక్టోబరు 4, వారాహి నాలుగో యాత్రలో భాగంగా జనసేన అధినేత కొన్ని నిజాలు విస్మరిస్తున్నారు. గత ఎన్నికల్లో ఓట్లు చీలడంపై ఆయన మాటలు సామాన్యుడికి సైతం విస్మయం కలిగిస్తున్నాయి. తెలుగుదేశంతో పొత్తును అధికారికంగా ప్రకటించిన తర్వాత పవన్ కల్యాణ్ తొలిసారి జనం ముందుకు వచ్చారు. వారాహి యాత్ర నాలుగో దశలో భాగంగా ఆయన ఆదివారం అవనిగడ్డలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని ప్రకటించారు. వైసీపీ దారుణంగా ఓటమి పాలవుతుందని జోస్యం చెప్పారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన మధ్య ఓట్లు చీలిపోయాయని చెప్పారు. ఈ సారి అలా జరగనివ్వనని ప్రతిన బూనారు. పవన్ ఇక్కడ ఓ లాజిక్ మిస్ అవుతున్నారు. గత ఎన్నికల్లో వైకాపాకు 49.95 శాతం, తెలుగుదేశానికి 39.17 శాతం, జనసేనకు 5.53 శాతం ఓట్లు వచ్చాయి. తెలుగుదేశం, జనసేనని కలిపినా.. వైకాపాకి వచ్చినన్ని ఓట్లు రాలేదు. సైకిల్, గ్లాసు కలిపి పోటీ చేసినా, వైకాపా గెలుపును ఆపలేకపోయేవారు. ఇది క్షేత్రస్థాయి వాస్తవం. 2019 ఎన్నికల్లో జనసేన ఆటలో అరటిపండులానే మిగిలిపోయింది.

విభారె



# నీకు ఒక్క ఛాన్స్ అయిపోయింది జగన్

## ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామ సభ ఎంపీడీఓ ప్రభాకర్



పెద్దకడబూరు అక్టోబరు 04 : ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలో నుండి ప్రతి గ్రామపంచాయతీలో 2024-25 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పొదుపు సంఘాల లీడర్లు, ఉప సర్పంచ్లు, ఎంపీటీసి లు,గ్రామ పెద్దలు, మేటీలు, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు, అందరి సమక్షంలో ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలకు, పనులు గుర్తించే కార్యక్రమం మొదలయ్యింది. ప్రతి రైతు తమకు కావలసిన పనులను రాయించుకోవాలని, ప్రతి ఒక్కరిని కోరుతున్నాం, మేట్స్ కూడా మీ గ్రూపులకు కావలసిన పనులను కచ్చితంగా రాయించండి. బస్సుల దొడ్డి.మురవణి. ముచ్చగిరి. మేకడోన తారపురము. కలుకుంట గ్రామాలలో ఉపాధి పనుల గుర్తింపు గ్రామసభలు, నిర్వహించడం జరిగినది.

## మురికి కాలువలు పరిశీలించిన కమిషనర్ రమేష్ బాబు





ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మున్సిపల్ కమిషనర్

ఆళ్ళగడ్డ ప్రతినిధి అక్టోబర్ 04 విభారె న్యూస్:- ఆళ్లగడ్డ పట్టణంలో బాలాజీ నగర్ లో మురికి కాలువలను పరిశీలించినట్లు ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. గత కొద్ది రోజులుగా బాలాజీ నగర్ లో రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తూ ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవుల విజయభాస్కర్ రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో కమిషనర్ వెంటనే స్పందించి బుధవారం మధ్యాహ్నం సచివాలయ సిబ్బంది శానిటేషన్ సిబ్బందితో రమేష్ బాబు కాలనీలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లపై మురికి నీరు పారకుండా తగు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అలాగే బాలాజీ నగర్ లోని ఒక వీధిలో ప్రజలు తిరిగే ఒక వీధిలో ముళ్ళ చెట్లు ఎక్కువగా పెరగడంతో వాటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆవుల విజయభాస్కర్ రెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చర్చి కాంపౌండ్ కు లక్ష విరాళం



మంత్రాలయం , అక్టోబర్,4, (విభారే న్యూస్): మండలంలోని బుదురు గ్రామం యం. బి చర్చి కంపౌండ్ నిర్మణానికి వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు జక్కయ్య బుధవారం లక్ష రూపాయలు విరాళంగా చర్చి సంఘ పెద్దలకు ఆందజేశారు. క్రైస్తవ సోదరులకు అండగా ఉంటామని జక్కయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు నాగరాజు, యేసేపు, జైపాల్ బోయాజు, విజయ్, యేసు, బ్రిటీష్, రాజు, ఇమ్మానియేల్ ఆబ్రహం, సామేలు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు చేసిన తప్పేంటో నీకు దమ్ముంటే నిరూపించు జగన్





పెద్దకడబూరు అక్టోబరు 04 : ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు దీక్షలో కూర్చున్నారు వైసిపి నేత జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికలలో ఒక్క ఛాన్స్ అని అడిగి బడుగు బలహీన వర్గాలను మోసం చేసి గెలిచి ఇప్పుడు తుగ్లక్ పరిపాలన చేస్తున్నాడు అని నీకు ఇచ్చిన ఒక్క ఛాన్స్ అయిపోయింది అని రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీదే అధికారం అని మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు వారు మంత్రాలయంలో చంద్రబాబు కు మద్దతుగా 25 వ రోజు చేస్తున్న రిలే దీక్షలో కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడుతూ జగన్ రెడ్డి చంద్రబాబు చేసిన తప్పేతో ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారు అని రానున్న రోజులో మీకు తగిన బుద్ధి చెబుతారని పాలకుర్తి తిక్క రెడ్డి హెచ్చరించారు ఈరోజు రిలే నిరాహారదీక్షలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ బసల దొడ్డి ఈరన్న , ఆర్ టి ఎస్ కన్వీనర్ దశరథి రాముడు తో పాటు అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు దీక్షలో కూర్చున్నారు ఈ కార్యక్రమంలో సంఘీభావం తెలియజేస్తిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడిగప్ప గౌడ్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు బాపురం సుధీర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప దేని, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, జిల్లా కార్యనిర్వా కార్యదర్శి కోట్రేష్ గౌడ్, జిల్లా వాణిజ్య విభాగము ఉపాధ్యక్షులు భరత్ శెట్టి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శిలు ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, బీసీ సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, కురుగోడు, అశోక్ రెడ్డి, విజయ రామిరెడ్డి, మైనార్టీ అధ్యక్షులు టిప్పు సుల్తాన్, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ, మాధవరం సాయికుమార్ రెడ్డి, చిన్న బొంపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు, వందగల్ మాజీ సర్పంచ్ నరసింహులు, పల్లెపాడు మాజీ సర్పంచ్ చంద్ర, చిన్న తుంబలం వీరేష్ గౌడ్, వగరూర్ పవన్ కుమార్ రెడ్డి, అబ్దుల్ సాబ్, బెలగల్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ రామయ్య, గుండేష్, ఉసేని, తిరుమలేష్, రాజు, జనార్ధన్, ఆర్లబండ రామాంజనేయులు, అయ్యప్ప, వారం గోపాల్, వడ్డే ఉల్లిగయ్య, రంగారెడ్డి, గోపాల్ ,శ్యాంసుందర్, నర్సిరెడ్డి, రామాంజి, పాండురంగ, నరసప్ప, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మారెప్ప, ఏసేపు, యోబు, బొగ్గుల నరసన్న, బసవలింగప్ప, ఎంపీటీసీ సభ్యులు రాజు, దేవన్న, బీసీ సాధికార సభ్యులు సిద్ధూ, నక్కి వెంకటేశ్వర్లు, వట్టెప్ప గారి నరసింహులు, మేకల నరసింహులు, శివ, రామకృష్ణ, మదిరి వీరారెడ్డి, కంబలదిన్నె శీను, హాలివి హుసేని, మల్లప్ప గౌడ్, హనుమాపురం ఈరన్న, పెద్దయ్య, మహాదేవ, చిన్న, తో పాటు అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# వ్యాసరచన పోటీలు



కోసిగి, అక్టోబర్ 04 (విభారె న్యూస్) మండల కేంద్రమైన కోసిగిలోని బాలుర హై స్కూలో గాంధీ జయంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలు"మత సామరస్యం అంటే ఏమిటి?నేటి భారత దేశ ప్రస్తుత పరిస్థితులు,మత సామరస్యం ఆవశ్యకత"అనే అంశం పై నిర్వహించారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,కోసిగి లో ప్రశంస పత్రాలు, బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠాశాల ప్రధానోపాధ్యులు ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ"గాంధీ అహింస అనే ఆయుధం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి తోడ్పడింది అని, అప్పటివరకు అహింసా ద్వారా దేశానికి స్వాతంత్ర్యం ప్రపంచంలో ఎవరూ సాధించలేదని, అహింసా యుత పద్ధతుల ద్వారా దేన్నైనా సాధించవచ్చని ప్రపంచానికి గాంధీ తెలియచేశారు అని, భారతదేశం భిన్న మతాలు,సంస్కృతుల సమాహారం అని,నేటి విద్యార్థులు రేపటి పౌరులు కాబట్టి పరమత సహనం విద్యార్థి దశ నుండే కలిగి ఉండి భవిష్యత్ భారతం శాంతి, సౌభాత్రుత్వాలతో వెలసిల్లాలని"అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కె తో విశ్వం పుట్టుక, మన గ్రహం పై ఉన్న జీవుల పుట్టుక రహస్యాలు శోధించి ఇప్పటివరకు అనాదిగా పేరుకుపోయిన మూఢ నమ్మకాల స్థానంలో విజ్ఞాన సౌరభాలతో కార్య, కారణ సంబంధాలతో దేనిని గుడ్డిగా విశ్వసించకుండా సత్యానేషన చేయాలని, ప్రేమ, ఆప్యాయత, అనురాలు విల్లవిరిసే మానవత్వం ఉన్న నేటి విద్యార్థులు,రేపటి పౌరులు గా మారాలని" పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తో పాటు,విద్యార్థులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆళ్ళగడ్డ ప్రతినిధి అక్టోబర్ 04 విభారె న్యూస్:- ఆళ్ళగడ్డ మండలంలోని మిట్టపల్లే గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యాధికారులు ఇళ్ల వద్దకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

## ఆళ్లగడ్డలో ఐ ఎం ఏ సీనియర్ సభ్యులకు ఘన సన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ ప్రతినిధిఅక్టోబర్04విభారెన్యూస్:-ఆళ్లగడ్డ ఐ.ఎం.ఎ.సీనియర్ సభ్యులైన డాక్టర్. కె.రామలింగారెడ్డిని, డాక్టర్. శీలం నరసింహారెడ్డిని ఆళ్లగడ్డ శిల్ప హోమ్స్ వద్ద ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ శాఖ కార్యవర్గం అధ్యక్షులు డా.కృష్ణ, సభ్యులు డా.విజయ భాస్కర్ రెడ్డి, డా.సుబ్బారెడ్డి, డా.అనిల్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రామగోపాల్ రెడ్డి, సురేంద్రనాథ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### -మంత్రాలయం,చెట్నేహళ్లి గ్రామాల్లో ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించిన -. సీతారామిరెడ్డి , ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి .- కాచాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి





మంత్రాలయం,అక్టోబర్,4,(విభారేన్యూస్):రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మంచి చేయడమే మా లక్ష్యమని టీటీడీ పాలకమండలి సభ్యులు వై. సీతారామిరెడ్డి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెట్నేహళ్లి, మంత్రాలయం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి, ఇన్ చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ల నేతృత్వంలో ప్రారంభించారు. ముందుగా తుంగభద్ర గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఖరీదైన వైద్య సేవలను సీఎం వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇంటి వద్ద కే వైద్య సిబ్బంది వచ్చి వారి కి ఏ రకమైన వైద్య సేవలు అందించాలని సర్వే చేసి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను అందజేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. చెట్నేహళ్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, అంగన్ వాడీ కేంద్రాల ను పెద్దాయన వై. సీతారామిరెడ్డి , ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మీదుగా ప్రారంభించారు. మంత్రాలయం లోని సోసైటి (శీనన్న పెట్రోలు బంక్) వద్ద నుంచి దాదాపు 400 బైకులతో నిర్వహించిన బైక్ ర్యాలీ లో పాల్గొన్ని సంత మార్కెట్ లో ఆర్బీకే, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఇరువురి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర గారి తల్లి పులికుక్క భీమక్క ను ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మాట్లాడి ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. తుంగభద్ర నది తీరం లో జగదీష్ స్వామి నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ ను సందర్శించి అల్పాహారం స్వీకరించారు. రాఘవేంద్ర నగర్ లో నివాసముంటున్న శివరాం బ్రదర్స్ లో ఒక్కరైన చిన్నారెడ్డి ఇటీవలే కర్నూలు ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటికి చేరుకున్న చిన్నారెడ్డి ని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఫ్రూట్స్ అందజేసి ధైర్యం చెప్పారు. అంతకు ముందు శివరాం, బంగారు బాబు ఎమ్మెల్యే అన్న కు పూలమాల వేసి స్వాగతం పలికారు. ఏది ఏమైన రాంపురం రెడ్డి సోదరుల పర్యటన మాత్రం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ బైక్ ర్యాలీ లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, మండల అధికారులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రాంపురం రెడ్డి సోదరుల అభిమానులు తదితరులు ఉన్నారు.

# మేము సైతం బాబు కోసం..



విభారే న్యూస్ డోన్ ప్రతినిధి:- అక్టోబర్ 4 బుధవారం రోజు నారా చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్ట్ కి నిరసనగా బాబు తో "మేము సైతం" అంటూ డోన్ లో 22వ రోజు బేతంచేర్ల మండలం, ఆర్.ఎస్.రంగాపురం, బుక్కాపురం , రహిమాన్ పురం, అంబాపురం గ్రామ నాయకులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి సంఘీభావం తెలిపారు. దీక్ష లో కూర్చున్నా వారు: జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లొద్ద శేఖర్, బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, రామ మద్దయ్య, గుడిసె మద్దిలేటి, మనోహర్ గౌడ్, రామస్వామి, ప్రసాద్, రాంకుమార్, వెంకటేశ్వర్లు, వేంకటేశ్ గౌడ్, పుల్లారెడ్డి, శేఖర్, సత్యం, నాగరాజు, అంబాపురం చంద్ర, నాగార్జున, శివన్న, బుజ్జినాయుడు, దుబ్బన్న, మాధవ స్వామి, రామ మద్దయ్య, శేషు, రామకృష్ణ, అగ్గి రాజు , నాగరాజు, తిమ్మయ్య, నాగమద్ది, పుల్లయ్య, విజేయుడు, సోమశేఖర, రవికుమార్, మధు , రామచంద్రుడు, రంగనాయకులు, సింహాద్రి, మహేష్, పుల్లయ్య, శేఖర్, అనంద్ , నాగార్జున, మహేష్ తదితరులు. సంఘీభావం తెలిపిన వారు: సీనియర్ టిడిపి నాయకులు ఆలంకొండ నభి, డోన్ నియోజకవర్గ టిడిపి సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, డోన్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ కమిటీ నాయకులు రవీంద్ర నాయక్, నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు, క్లస్టర్ ఇంచార్జ్ గోవిందు, డోన్ నియోజకవర్గ టిడిపి తెలుగుయువత అధ్యక్షులు కుమ్మరి సుధాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, గోవిందరెడ్డి, జగదూర్తి ప్రతాప్ రెడ్డి, తాడురు రమణయ్య, కొచ్చెరువు నాగన్న, ఐటిడిపి వినయ్ చౌదరి, ఎమ్మిగనూరు ఈరన్న తదితరులు సంఘీభావం తెలిపారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**